# ఆగస్టు 9-14 తేదీల మధ్య సచివాలయ ఉద్యోగ రాతపరీక్షలు

**ప్రాథమికంగా షెడ్యూల్ ఖరారు**

- ఈ నెల 28కి పరీక్షా కేంద్రాల గుర్తింపు ప్రక్రియ పూర్తి
- అప్పటికి కరోనా ఇబ్బందులు లేకుంటే యథావిధిగా రాత పరీక్షలు

**సాక్షి, అమరావతి:** సచివాలయ ఉద్యోగాల రాత పరీక్షలు ఆగస్టు 9వ తేదీ నుంచి 14 వ తేదీ వరకు ఆరు రోజులపాటు నిర్వహించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ మేరకు పరీక్షల నిర్వహణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ పరీక్షల ప్రాథమిక షెడ్యూల్‌ను రూపొందించి తుది అనుమతి కోసం ప్రభుత్వానికి పంపింది. ఈ నెల 28 నాటికి పరీక్షా కేంద్రాల గుర్తింపు ప్రక్రియ పూర్తవుతుందని వెల్లడించింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 19 రకాల పోస్టులకు సంబంధించి మొత్తం 16,208 ఉద్యోగాల భర్తీకి జనవరిలో పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖలు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేయగా.. వీటికి 11.06 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు.

**కరోనా పరిస్థితులపై ఎప్పటికప్పుడు అంచనా..**

- వీలైనంత త్వరగా పరీక్షలు నిర్వహించి, ఉద్యోగాల భర్తీ పూర్తి చేయాలని భావిస్తున్న అధికారులు, ప్రస్తుత కరోనా పరిస్థితులను కూడా ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు.
- పరీక్షల నిర్వహణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకునే అంశంపై దృష్టి సారించారు.
- రాత పరీక్షల సమయంలో ఒక్కో గదిలో 16 లేదా 24 మంది అభ్యర్థులు కూర్చోవడానికి వీలుగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
- ఆగస్టు నెలలో పరీక్షల నిర్వహణ నేపథ్యంలో అప్పటికి కరోనా వైరస్ విస్తరణ ఎలా ఉంటుందనే విషయంపై వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను కూడా సంప్రదిస్తున్నారు.
- మరోవైపు.. ఆగస్టు రెండో వారంలో రాతపరీక్షలు జరిగే అవకాశం ఉందని, దరఖాస్తుదారులు సిద్ధంగా ఉండాలని పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది ట్వీట్ చేశారు. పూర్తి స్థాయి షెడ్యూల్‌ను త్వరలో వెల్లడించనున్నట్టు పేర్కొన్నారు.